ప్రజాశక్తి

ఆదివారం 18 జూన్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

నిందితులపై పోక్సో కేసు

- అమర్నాథ్ హత్య కేసులో ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ హత్య కేసులో మొత్తం నలుగురు నిందితులపై పోక్సో చట్టంతో పాటు, సెక్షన్ 354 (డి), 341, 506, 323, 302, ఆర్/డబ్ల్యు 34 ఐపీసీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శనివారం చెరుకుపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడు పాము వెంకటేశ్వరరెడ్డి అమర్నాథ్ సోదరిని గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఆమె వెంటపడి తరచుగా వేధిస్తూ ఉండటం గమనించిన అమర్నాథ్ తన సోదరిని వేదించవద్దు అని, వెంకటేశ్వరారెడ్డిని పలుమార్లు హెచ్చరించారు. వెంకటేశ్వరరెడ్డి ▶ 2లో

అమర్నాథ్ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం

5లో ▶

నిందితులను కఠినంగా శిక్షించాలని..

అమర్నాథ్ మృతదేహంతో ధర్నా

- 'ఎంపీ గోబ్యాక్' అంటూ మోపిదేవి కాన్వాయ్‌ను అడ్డగించిన గ్రామస్తులు
- ఆయన వ్యక్తిగత సాయం రూ.లక్షను నిరాకరించిన బంధువులు



విలపిస్తున్న కుటుంబసభ్యులు



ధర్నా చేస్తున్న బంధువులు, నాయకులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఉప్పాల అమర్నాథ్ మరణానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేస్తూ రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్, బీసీ సంఘ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్లో శనివారం ధర్నా నిర్వహించారు. అమర్నాథ్ మతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి శనివారం మధ్యాహ్న సమయంలో చెరుకుపల్లి తీసుకురాగా.. మతదేహంతో రెండు గంటలసేపు ధర్నా నిర్వహించారు. కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని పలువురు నాయకులు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ధర్నా కార్యక్రమం వద్ద రేపల్లె ఆర్డీవో జే.పార్థసారథి, తహశీల్దార్ మల్లికార్జునరావు సందర్శించి.. ప్రభుత్వం నుండి సహాయం అందేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన్న శంకర్రావు, సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్.మణిలాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, ఆర్య, శరత్ పాల్గొని.. సంఘీభావం ప్రకటించారు.

ఎంపీ మోపిదేవికి నిరసన సెగ

అమర్నాథ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావుకు గ్రామస్తుల నుంచి నిరసన ఎదురైంది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ 'ఎంపీ గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. తన వ్యక్తిగత నిధుల నుండి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసేందుకు ప్రయత్నించగా వాటిని తీసుకొనేందుకు అమర్నాథ్ బంధువులు నిరాకరించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తూ ఎంపీ కాన్వాయ్‌కు అడ్డంగా వెళ్లారు.

నియోజకవర్గాల్లో

రాజకీయ వేడి



- టిక్కెట్ల కోసం పార్టీల్లో నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం
- ఎన్నికలు సమీపిస్తున్నందున జనాకర్షణ వ్యూహాల్లో నేతలు
- పథకాల ప్రచారంలో వైసిపి..
- కొత్త మేనిఫెస్టోతో టిడిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లాలో రోజురోజుకూ రాజకీయవేడి పెరుగుతోంది. నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్నందున పోటీ చేసేందుకు నేతలు సన్నాహాల్లో ఉన్నారు. నాలుగేళ్లు నిండాక ఐదో ఏడాది అనగానే ఎన్నికలపైనే అందరి దృష్టి ఉంటుంది. ఇప్పుడూ ప్రధాన పార్టీలు ఇదే పంథాలో నడుస్తున్నాయి. ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అన్ని వైపుల నుంచి ఏర్పాట్లలో ఉన్నారు. కొత్త పొత్తులు తెరపైకి వచ్చాయి. రాజకీయ సమీకరణల్లో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. ఈ సారి బలాబలాల్లో మార్పులుంటాయనే చర్చ ముందుకు వచ్చింది. కొత్త పొత్తుల విషయానికి వస్తే గత ఎన్నికల్లో ముక్కోణపు పోటీలున్నాయి. వైసిపి, తెలుగుదేశం నుంచి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జనసేన, వామపక్ష కూటమి కలిసి పోటీ చేశాయి. ఈ సారి జనసేన తిరిగి తెలుగుదేశం వైపునకు చేరే అవకాశాలు దాదాపుగా నూరు శాతం పెరిగాయి. జనసేన చీల్చిన ఓట్లతోనే ఓడిపోయామనే అంచనాల్లో ఉన్న తెలుగుదేశం నేతలకు ఈ పరిణామం ఊరటగా మారింది. ఒంగోలుతో పాటు కొన్ని నియోజకవర్గాల్లో జనసేన వల్ల తెలుగుదేశం నష్టపోయిందన్నదీ వాస్తవం. వైసిపి పాలనపై ఎవరి అభిప్రాయం ఏమిటనేదీ ఎన్నికల్లో తేలనుంది. పొత్తులపైనే అందరి దృష్టి ఉంది. నియోజకవర్గాల్లో బలాబలాలు ఎలా ఉంటాయనే దానిపై సర్వేలు సాగుతున్నాయి. ఓట్ల చీలికలపైనా నేతలు దృష్టి సారించారు. ఏఏ వర్గాల ఓట్లు పోతాయనే అంశంపైనా పరిశీలన చేస్తున్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు కొత్త పరిణామాలపైనా, సమీకరణలపైనా పూర్తిగా దృష్టి సారించారు. అయితే పార్టీల్లో అభ్యర్థిత్వాలపై ఇంకా స్పష్టత రాకపోవడం కూడా గందరగోళానికి దారితీస్తోంది. ప్రధానంగా వైసిపిలో ఒంగోలు, వైపాలెంలో పోటీ చేసే సీనియర్ నేతలకు తప్ప మిగతా ఎమ్మెల్యేలకు టిక్కెట్లపై స్పష్టత లేదు. ఎవరికి టిక్కెట్టు వస్తుందో ఎవరికి రాదో ▶ 2లో



'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులు అందుకున్న విద్యార్థులు

దేశానికే ఆదర్శంగా..

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు: మంత్రి

▶ 5లో

నియోజకవర్గాల్లో రాజకీయ వేడి

(మొదటిపేజీ తరువాయి)

తెలియడం లేదు. జిల్లా నేత బాలినేని ఇటీవల అధిష్టానం లోని కీలక నేతపై దండెత్తారు. ఈ పరిణామాలు పార్టీలోనే అస్పష్టతకు దారితీశాయి. నేతల మధ్య ఐక్యత లేదు. సమన్వయం అంతకన్నా లేదు. భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనేదీ నేతలకు తెలియడం లేదు. బాలినేనికి జిల్లా బాధ్యతలు అప్పగిస్తారా? లేదా? అనేదీ స్పష్టత రావాల్సి ఉంది. మరో సీనియర్ నేత కరణం బలరాంతో కలిసి ఆయన భవిష్యత్ రాజకీయ వ్యూహరచనలో ఉన్నారు. వైసిపిలో ప్రస్తుతం ఎమ్మెల్యేలపైనా, ఇన్‌ఛార్జిలపైనా పలు ఆర్థిక ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా ఈ వసూళ్లపై ప్రశ్నిస్తే వారిపై ఆరోపణలతో ఎదురుదాడులు చేయడం సహజమయ్యాయి. గ్రానైట్, రేషన్‌బియ్యం, భూముల ఆక్రమణలు, గ్రావెల్, ఇసుక వంటి అక్రమ రవాణాతో రూ.కోట్లు సంపాదిస్తున్నారు. వీటిపై పార్టీలోనే ఒకరిపై ఒకరు పిర్యాదులు చేసుకుంటున్నారు. వైసిపిలో టిక్కెట్లపై స్పష్టత రావాల్సి ఉంది. మొక్కుబడిగా సాగే కార్యక్రమాల్లో నేతలు పాల్గొంటున్నారు. సంక్షేమ పథకాల ప్రచారమే ఇప్పుడు వైసిపికి ప్రధాన ఎజెండాగా మారింది. ఇక తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే తాజాగా చంద్రబాబు విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోపై నియోజకవర్గాల్లో సమావేశాలు పెడుతున్నారు. మేనిఫెస్టోను జనంలోకి తీసుకుపోవడం ఎజెండాగా పెట్టుకున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇపుడు నియోజకవర్గస్థాయి సమావేశాల్లో బిజీగా ఉన్నారు. మండలాల వారీగా సమావేశాలు పెట్టి పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలకు తెలుగుదేశం వ్యతిరేకం కాదనే ప్రచారం జనంలోకి తీసుకుపోవడం ఇప్పుడు ఆ పార్టీకి అనివార్యమైంది. మరోవైపు వచ్చే నెలలో లోకేష్ జిల్లాకు రానున్నారు. ఇప్పుడు తెలుగుదేశం నేతలు పూర్తి ఎన్నికల దిశగానే అడుగులు వేస్తున్నారు. దర్శి నియోజకవర్గం తప్ప అన్ని చోట్లా పోటీ చేసే అభ్యర్థులపై స్పష్టత ఉంది. జనసేన కలిసి వస్తుందనే ఉత్సాహం పార్టీ నేతల్లో ఉంది. గత ఎన్నికల్లో ఏఏ అంశాల్లో వైఫల్యం జరిగిందో ఇపుడు వాటిపై దృష్టి సారించారు. ఈసారి ఆ తప్పిదాలు జరగకుండా చూసుకోవాలనే ఆలోచనలో గట్టిగా ఉన్నారు. ఇక పార్టీల్లో టిక్కెట్లు రావని తెలిసిన నేతలు కొత్త దారులు కూడా వెతుక్కుంటున్నారు. ఏ పార్టీ అనేదాని కన్నా టిక్కెట్టు సాధించి పోటీచేయడం ముఖ్యమనే ఆలోచనలో కొందరు నేతలున్నారు. అసమ్మతివర్గాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఎమ్మెల్యేలపై సొంతపార్టీ నేతలే ఆరోపణలు చేస్తున్న పరిస్థితి వైసిపిలో మరింత పెరిగింది. ఎన్నికలు సమీపించే కొద్దీ అన్ని వ్యవహారాలు తెరపైకి రావడం సహజమే..

నిందితులపై పోక్సో కేసు

(మొదటిపేజీ తరువాయి)

తల్లిదండ్రులకు కూడా తన తల్లిని, మామయ్యను తీసుకువెళ్లి చెప్పాడు. గ్రామంలో ఈ విషయంపై తనపైన దుష్ప్రచారం చేస్తున్నాడని.. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న నిందితుడు వెంకటేశ్వరరెడ్డి అమర్నాథ్ వల్ల తనకు ఇబ్బందిగా ఉందని, అతనిని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ముందు రోజే పెట్రోల్ సిద్ధం చేసుకుని, తనకు సహాయంగా మరో ముగ్గురు స్నేహితులతో కలిసి హత్య చేసేందుకు వ్యూహం రచించాడు. సహాయం చేసేందుకు తన గ్రామానికి చెందిన పాము గోపిరెడ్డి, ఆరుంబాక గ్రామ పంచాయతీకి గ్రామానికి చెందిన మద్దెల వీరబాబు, మరియు తుమ్మ సాంబిరెడ్డి సహాయంతో 16వ తేదీ ఉదయం 10వ తరగతి ట్యూషన్‌కి వెళ్తున్న ఉప్పాల అమర్నాథ్‌ను వెంబడించి సమీప పొలాల్లోకి తీసుకువెళ్లారు. అనంతరం అతనిని బాగా గాయపరిచి.. వెంటనే తమ వెంట తెచ్చిన పెట్రోల్‌తో సజీవ దహనం చేసేందుకు ప్రయత్నించారు. తీవ్రంగా గాయపడిన అమర్నాథ్ అరుపులకు నిందితులు పారిపోగా సమీపంలో గమనించిన గ్రామ వాలంటీర్ డి.రామమూర్తిరెడ్డి వెంటనే అమర్నాథ్ తల్లి బంధువులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడకు చేరుకున్న బంధువులు హుటాహుటిన చెరుకుపల్లి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. కేసులో ప్రధాన నిందితుడితో పాటు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని, మరొక నిందితుడు తుమ్మ సాంబిరెడ్డిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు అధికారిగా వేమూరు సిఐను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రేపల్లె డిఎస్పీ టి.మురళీకష్ణ, రేపల్లె రూరల్ సీఐ శివశంకర్, ఎస్సై కొండారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం: ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని, పేదలకు, వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు, ఇది సద్వినియోగం అయ్యేలా చూసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు జరుగుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉసా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ సోమవారం మండలంలో జరుగుతుందని, సిఎస్ పురం ఎండిఓ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా జరుగుతుందని అన్నారు. ఉపాధి హామీ కూలీలందరూ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మోడల్ స్కూల్ విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభను చాటి జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో ప్రతిభను చాటిన విద్యార్థులు ఏ మణికంఠ రూ.50,000, ఎస్ పవన్‌కుమార్‌రెడ్డి రూ.15,000 నగదు పురస్కారానికి ఎంపికయ్యారు. శనివారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని, జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా నగదు పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థులు ప్రతిభను చాటేలా కృషి చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ వివి రమణయ్యను అభినందించి సత్కరించారు.

అమ్మకానికి 935 బేళ్లు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం నాడు అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు 935 ఉన్నాయని వేలం నిర్వహణాధికారి ఎస్ రామారావు తెలిపారు. అందులో 860 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 75 బేళ్లు ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అందులో అత్యధిక ధర రూ.245, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.231.70 పలికిందన్నారు.



అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నలుగురు ఆణిముత్యాలకు సన్మానం

ప్రజాశక్తి-దరిశి

జగనన్న ఆణిముత్యాలులో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో 8 మందికి అవార్డులు ఇవ్వగా దరిశి మోడల్ స్కూల్ నలుగురు విద్యార్థులకు ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలతోపాటు మరో రెండు బహుమతులు విద్యార్థులకు కలెక్టరు దినేష్‌కుమార్, రాష్ట్రమంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో 8 మందిలో దరిశి మోడల్ పాఠశాలలో నలుగురు విద్యార్థులకు రావడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను, మరియు ప్రిన్సిపల్ హసీనాభాను కలెక్టరు దినేష్‌కుమార్ శాలువాతో మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో పాఠశాలకు మంచిపేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.

కాలుజారి నీటిలో పడి బాలిక మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

సెలవులలో సరదా కోసం నీటి వద్దకు వచ్చి కాలుజారి నీటిలో పడి మృతి చెందడంతో కుటుంబంలోని సరదా కాస్తా విషాదంగా మారింది. చెక్ డ్యామ్ వద్ద నీటిలో కాలు జారిపడి బాలిక మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం టంగుటూరు మండలం అనంతవరం – తేటుపురం మధ్య జరిగింది. ఈ ప్రమాదంలో ఒంగోలు సమీపంలోని పేర్నమిట్టకు చెందిన సాయి అక్షయ(14) మృతి చెందింది. పేర్నమెట్టకు చెందిన సాయి అక్షయ, హర్షిత ఇరువురు బాలికలు వేసవి సెలవుల నిమిత్తం వారి పిన్ని స్వగ్రామం కొత్తపట్నం మండలం ఈతముక్కలకు వచ్చారు. బాలికలు ఇరువురు సరదాగా శనివారం సాయంత్రం టంగుటూరు మండలం, తేటుపురం వద్ద రొయ్యల చెరువులు చూసేందుకు వెళ్లారు. ఈ తరుణంలో తేటుపురం – అనంతవరం మధ్యన చెక్ డ్యాం వద్ద మంచినీరు తాగేందుకు వచ్చి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయారు. బాలికలు ఇరువురు పెద్దగా కేకలు వేయగా అక్కడే ఉన్న మత్స్యకారులు కొందరు హుటాహుటిన వచ్చి బాలికలు ఇరువురిని బయటకు తీశారు. కానీ అప్పటికే సాయి అక్షయ మృతి చెందింది. కొంత అస్వస్థతగా ఉన్న హర్షితను చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా పరిశీలించారు. టంగుటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీలారీ బోల్తా -తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కనిగిరి

మినీ లారీ బోల్తా కొట్టిన సంఘటన శనివారం తెల్లవారుజామున కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒంగోలు మార్గంలో కాశిరెడ్డి కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. విజయవాడ నుంచి అనంతపురం వెళుతున్న మందుల లోడుతో ఉన్న మినీలారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు.

బిల్డింగ్ పై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి జారిపడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మార్కాపురం కాలేజీ రోడ్డులోని ఒక బహుళ అంతస్తు భవనానికి సెంట్రింగ్ చేస్తున్న మేనకబోయిన కాటమరాజు(22) 5 అంతస్తులపై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన సహచర కూలీలు హుటాహుటిన కాటమరాజును పట్టణంలోని కందుల ఓబుల్ రెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 6 గంటల సమయంలో తుది శ్వాస విడిచాడు. మృతుడిది దొనకొండ మండలం మల్లంపేట గ్రామం. తండ్రి బసవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్కాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

టిడిపి మేనిఫెస్టోను ప్రజలలోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-దరిశి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మహానాడులో భవిష్యత్ గ్యారెంటీ పేరుతో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను నియోజకవర్గంలోని ప్రజలలోకి తీసుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు కోరారు. శనివారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు 150 రోజులపాటు మండల స్థాయి అనుబంధ కమిటీలు గ్రామస్థాయిలో ప్రజలలోకి తీసుకెళ్లనున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో నాయకులు సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.

ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బందిపై

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ప్రజాశక్తి-అద్దంకి

బాకీ లేకపోయినా, కిస్తీలు కట్టాలని వేధించటాన్ని ప్రశ్నించిన దళితులపై దాడి చేసిన ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదయింది. నాగులుప్పలపాడు మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కాకుమాను రవి ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ నుంచి హౌసింగ్ లోన్ తీసుకున్నారు. క్రమం తప్పకుండా వాయిదాలు కడుతున్నప్పటికీ, కిస్తీలు కట్టాలని, బాకీ ఉన్నారని కస్టమర్ కేర్ నుంచి కాల్స్, సెల్ ఫోన్ మెసేజ్‌లు వస్తుండడంతో, రవి తన బంధువైన కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావుతో కలిసి, శుక్రవారం అద్దంకిలోని ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీకి వెళ్లారు. అక్కడ సిబ్బందిని కలిసి తన సమస్య చెప్పుకున్నారు. తాను బాకీ లేకపోయినా, తనకు వస్తున్న మెసేజ్‌లను మేనేజర్ చింతపల్లి శ్రీనివాసరావుకు చూపించారు. ఇదంతా ఫైనాన్స్ కంపెనీలోని సీసీ కెమెరాలో రికార్డు అయింది. రవి, శీనులను ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది బలవంతంగా తోసుకుంటూ ఆఫీసు కిందకు తీసుకువచ్చి, సీసీ ఫుటేజీ లేని ప్రాంతంలో దాడి చేసి గాయపరిచారు. ఫైనాన్స్ సిబ్బంది దాడిలో, శీను చేతికి రక్త గాయాలు, రవికి కాలు మడిమ దగ్గర గాయమైంది. రవి, శీనుపై దాడి చేయటం చూసి ప్రశ్నించిన వారిపై సైతం ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది దౌర్జన్యం చేశారు. శీను, రవిలను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పారు. మెరుగైన వైద్యం కోసం రవిని ఒంగోలు తరలించాలని స్థానిక వైద్యులు సిఫారసు చేశారు. రవి ఫిర్యాదు మేరకు అద్దంకి పోలీసులు క్రైమ్ నెంబర్ /2023గా, ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ



వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు

మేనేజర్, ఇతర సిబ్బందిపై కేసు నమోదు చేశారు. మాల యువకులపై దాడి జరిగిందని తెలియడంతో జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, అద్దంకి మాల మహానాడు అధ్యక్షులు కిరణ్‌తో కలిసి అద్దంకి ప్రభుత్వ హాస్పిటల్‌కి వెళ్లి బాధితులను పరామర్శించారు. దళితులపై దాడి చేయడమే కాకుండా, తప్పుడు కేసు పెట్టేందుకు ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ మేనేజర్ ప్రయత్నిస్తున్నాడని తెలిసి, అంజయ్య అద్దంకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోశయ్యతో మాట్లాడారు. ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది దళితులే తమపై దాడికి వచ్చారని పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చారని, సీసీ ఫుటేజ్ పరిశీలించాలన్న అంజయ్య సూచన మేరకు, సీసీ ఫుటేజ్ పరిశీలించారు. అనంతరం ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీ మేనేజర్, సిబ్బందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయింది. ఈ కార్యక్రమంలో నూకతోటి సుబ్బయ్య, అల్లాడ ఆంజనేయులు, పులిపాటి హేబేలు దారా ఆంజనేయులు, నారాయణ, బొనిగేల దావీదు, గుడిమెట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు: మద్దిశెట్టి

ప్రకాశం-దరిశి

వైసిపి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. దరిశి నగర పంచాయతీలోని 8వ వార్డులో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఇంటింటికీ తిరిగి అందుతున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాలలో భాగంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో అర్హులైన మిగిలిన వారికి కూడా సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ఎలాంటి సిఫారసులు లేకుండా అందరికీ పథకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 8వార్డు కౌన్సిలరు ఎం మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, హరీష్, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, గోళ్లపాటి అచ్చయ్య, చిన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.

కొండపి మండలంలో రెండు చోట్ల చోరీ

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని అనకర్లపూడి గ్రామంలోనూ, కొండపి మద్దులూరు రోడ్డులో కోల్డ్ స్టోరేజీ పక్కన ఉన్న చర్చిలోనూ చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి మండలంలోని అనకర్లపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసి ప్రారంభించిన రైతు భరోసా కేంద్రం ముందు తలుపు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి గురైంది. శనివారం విఏఏ భరత్‌కుమార్ రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చే సరికి తలుపు లేకపోవడంతో వెంటనే లోపల ఉన్న సామానులను పరిశీలించారు. తలుపు తప్పితే మిగతా అన్ని సామానులు అక్కడే ఉన్నాయని భరత్ తెలిపారు. వెంటనే వ్యవసాయ అధికారి రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించి ఉన్నత అధికారులు దృష్టికి తీసుకొని పోయాడున. కొండపి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు భరత్ తెలిపారు. అదే విధంగా కొండపి మద్దులూరు రోడ్డులో ఉన్న కోల్డ్ స్టోరేజ్ పక్కనే ఉన్న చర్చిలో తలుపు, నాలుగు ఫ్యాన్లు, 20 కుర్చీలు, రెండు సౌండ్ బాక్సులు దొంగతనానికి గురయ్యాయని అక్కడ ఉండే వారు తెలిపారు. వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో ఏఎస్ఐ అంకారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మోపిదేవిని కలిసిన సూరగాని దంపతులు

ప్రజాశక్తి-చీరాల

రాజ్యసభ సభ్యులు, వైసిపి బాపట్ల జిల్లా ఇన్చార్జి మోపిదేవి వెంకటరమణ రావుతో బాపట్లలో జరిగిన మీడియా సమావేశంలో శనివారం బిసిసేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మరియు చీరాల ఐదవ వార్డు వైసిపి కౌన్సిలర్ సూరగాని లక్ష్మి, నరసింహారావు దంపతులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మోపిదేవితో కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థి మృతి బాధాకరమని బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల తక్షణ ఆర్థిక సహాయం చేస్తున్నట్లు మీడియా ముందు ప్రకటించి కుటుంబానికి అండగా ఉన్నట్లు తెలపడం హర్షణీయమని అన్నారు. ఘటనకు కారకులైన వారిలో ఈపాటికే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, మరొకరి కోసం గాలింపు చర్యలు చేపట్టారని అన్నారు. విద్యార్థి మృతికి కారకులైన వారందరినీ కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి అండగా ఉండి వారికి న్యాయం చేయాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావును ఆమె కోరినట్లు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-అద్దంకి

ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన స్థానిక ఎన్‌బిఐ కాలనీ రోడ్‌లో నవ్య అపార్ట్మెంట్ 5వ అంతస్తులో శనివారం జరిగింది. వివరాల ప్రకారం.. పోచేపల్లి హరీష్(31) ఉన్నత చదువులు చదువుకొని కొంతకాలం నుంచి మత్తు పదార్థాలకు బానిస అయి తిరుగుతున్నాడు. శనివారం స్థానిక ఎన్‌బిఐ కాలనీ రోడ్ నవ్య అపార్ట్మెంట్‌లోని బంధువుల ఫ్లాట్‌లో మనస్థాపానికి గురై క్షణికావేశంతో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు పట్టణ సిఐ ఎం రోశయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొండపి

కొండపి పట్టణంలో ఎస్సీ కాలనీకి చెందిన చాట్రగడ్డ బోయేజు(80) వడదెబ్బ తగిలి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంత కాలం నుంచి కాస్తున్న ఎండతీవ్రతకు బోయేజుకు వడదెబ్బ తగిలింది. దాంతో ఆసుపత్రికి తీసుకొని పోయేసరికి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు నరసింహారావు ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి-పొదిలి



పొదిలి పట్టణంలో సుపరిచితులుగా, సీనియర్ జర్నలిస్టుగా గుర్తింపు పొందిన ప్రజాశక్తి మాజీ రిపోర్టర్ పెండెం నరసింహారావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం విశ్వనాథపురం రెండో లైన్‌లో తమ స్వగృహమందు జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసింహారావు అభిమానులు, మిత్రులు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్ భాస్కరరావు మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంక గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు గుళ్లపల్లి భాస్కరరావు(99) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన పార్థివ దేహానికి మాజీమంత్రి నక్కా ఆనందబాబు, రేపల్లె మాజీ ఎంఎల్ఏ ముమ్మనేని వెంకటసుబ్బయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల టిడిపి నాయకులు మరియు సిపిఎం నాయకులు బిఎల్‌కె ప్రసాద్, వి వెంకట్రామయ్య, బొరుగడ్డ సుబ్బారావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-నగరం: మండలంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షులు చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సచివాలయ సిబ్బందికి ఆయన దిశా నిర్దేశం చేశారు. మండల పరిధిలో అర్హత ఉన్న ఏ ఒక్కరికీ కూడా జగనన్న సంక్షేమ ఫలాలు అందలేదని ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు రాకూడదని వారికి తెలిపారు. క్యాస్ట్, ఇన్ కమ్, డెత్, బర్త్, మ్యారేజ్, ఫ్యామిలీ, కౌలు రైతు కార్డు, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ వంటి 9రకాల సర్టిఫికెట్స్‌ను వెంటనే అందించేందుకు ఈ జగనన్న సురక్ష ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హులను గుర్తించి అందవలసిన పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి చక్రపాణి ప్రసాద్, తహసీల్దార్ ఎం శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

రేపల్లె పట్టణ సిఐగా నజీర్ బేగ్

ప్రజాశక్తి-రేపల్లె



రేపల్లె పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా ఎం నజీర్‌బేగ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సీఐడీలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై రేపల్లె విచ్చే శారు. రేపల్లె సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయచంద్ర గుంటూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నజీర్ బేగ్‌కు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



పతకాలతో షాలేంరాజు

షాలేంరాజుకు పురస్కారాల వెల్లువ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేంరాజుకు పురస్కారాలు వెల్లువెత్తాయి. శనివారం బాపట్ల ఎన్జీఓ హోమ్‌లో లిటిల్ చాంప్ అకాడమీ, టిఎన్ఆర్ ఫౌండేషన్, బాపట్ల జిల్లా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జోష్త మరియు షాలేం రాజ్‌లకు జాతీయ సామాజిక విశిష్ట సేవా భూషణ్ పురస్కారం మరియు నేషనల్ ఐకాన్ లు అందుకున్నట్లు గ్రేస్ ఫౌండేషన్ సభ్యులు యాన్నం సురేష్ తెలిపారు. ఈ పురస్కారాలను ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె ఉమ, లిటిల్ చాంప్ అకాడమీ డైరెక్టర్ బుకేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-పంగులూరు

పదవ తరగతి చదువుతున్న అమర్నాథ్ అనే విద్యార్థిని, కాపు కాసి భయంకరంగా కొట్టి, పెట్రోల్ పోసి తగలబెట్టిన హంతకులను కఠినంగా శిక్షించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర గౌడ సాధికారత కమిటీ మెంబర్ దాసరి హనుమంతరావు గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పంగులూరులో ఇందుకు సంబంధించి ఆయన ఒక ప్రకటన చేశారు. తన అక్కను ఇబ్బంది పెట్టవద్దని చెప్పిన తమ్ముడిపై, అహంకారంతో హింసాత్మకంగా కర్రలతో కొట్టి, పెట్రోల్ పోసి తగలబెట్టడం దుర్మార్గమని, ఈ చర్యకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లకు ప్రభుత్వం సరైన రక్షణ కల్పించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని హనుమంతరావు గౌడ్ అన్నారు. అద్దంకి నియోజకవర్గం గౌడ సంఘం తరపున ఈ సంఘటనను ఖండిస్తున్నామని అన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పంగులూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని, హౌసింగ్ పీడీ, పంగులూరు మండల ప్రత్యేక అధికారి జేవిఎస్ఆర్‌కె ప్రసాద్ కోరారు. శనివారం పంగులూరులోని మండల ప్రజా పరిషత్ సమావేశ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుందని, దానిని ముందుకు తీసుకెళ్లడంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కృషి చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలి, అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయి, ఏ విధమైన పరిస్థితులు ఎదురవుతాయి, వాటిని తట్టుకొని కార్యక్రమాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి, అనే అంశాల గురించి ప్రసాదు సిబ్బందికి వివిధ అంశాల్లో వివరించారు. ఎంపీడీవో రామాంజనేయులు మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంలో వివరించాల్సినవి ఈ నెల 19వ తేదీన సచివాలయాల్లోని వాలంటీర్లకు తెలియజేయాలని, 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆయా సచివాలయాల పరిధిలోని ఇంటింటికీ తిరిగి, ప్రజలందరినీ కలిసి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న పథకాల గురించి, వారి పొందుతున్న లబ్ధిని గురించి వివరించాలన్నారు.

నేడు ప్రజా సంఘాల

భవన విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లా కేంద్రమైన బాపట్లలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల భవనం విస్తరణ పనులకు ఈ నెల 18 ఆదివారం శంకుస్థాపన చేస్తున్నట్లు సిఐటియు బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య శనివారం విలేకరులకు తెలిపారు. గంగయ్య మాట్లాడుతూ గత ఆరేళ్ల క్రితం అనేకమంది ఉద్యమ శ్రేయోభిలాషుల సహకారంతో బాపట్ల ప్రాంతంలో ఉద్యమ అవసరాల కోసం ప్రజాసంఘాల భవనం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. బాపట్ల నూతన జిల్లాగా ఏర్పడ్డాక జిల్లా స్థాయిలో అవసరాలరీత్యా ఉన్న భవనంపై జిల్లా ప్రజాసంఘాల కార్యాలయ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యమ శ్రేయోభిలాషులందరూ సహాయ సహకారాలు అందించాల న్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఈ కార్యాలయం కేంద్రంగా కార్మికులు, కర్షకులు, సామాజిక శక్తుల సమస్యలపై, సమస్యల పోరాటాలు నిర్వహించడానికి కేంద్రంగా ఉంటుందని అన్నారు. కార్యాలయ విస్తరణకు జరిగే శంకుస్థాపన పనులు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే ధనలక్ష్మి ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. వామపక్షవాదులు, ప్రజాతంత్ర సామాజిక శక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు కే నాగేశ్వరరావు, మహిళా సంఘం నాయకురాలు సుభాషిణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగయ్య

విద్యార్థి అమర్నాథ్ హత్య దారుణం

ప్రజాశక్తి-పొదిలి

పదో తరగతి విద్యార్థి అమర్నాథ్‌పై పెట్రోల్ పోసి దారుణంగా హతమార్చడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. విద్యార్థి చావుకు కారణమైన దోషులను వెంటనే శిక్షించాలని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదా తెలిపారు. రాష్ట్రంలో రౌడీలు గ్యాంగ్‌స్టర్లు గతంలో ఎన్నడూ లేని విధంగా రెచ్చిపోతున్నారన్నారు. భుకబ్జాదారులు, కిడ్నాపర్లు, హంతకులు పెట్రేగిపోతున్నారని అధికార పార్టీ ఎంపీ కుటుంబాన్ని కిడ్నాప్ చేస్తేనే దిక్కులేదన్నారు. ఇక సామాన్యుల ఆస్తులకు, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో భూకబ్జాలు లేవు, రౌడీ షీటర్ ల కదిలికలు లేవు అని పోలీస్ బాస్ డిజిపి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. జగన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో పోలీస్ వ్యవస్థ అస్తవ్యస్తంగా, అచేతనంగా తయారయిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యానికి నైతిక బాధ్యతగా రాష్ట్ర హోంశాఖ మంత్రి రాజీనామా చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

పశు నష్టపరిహార పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రేపల్లె: వైఎస్సార్ పశు నష్టపరిహార పథకాన్ని పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులు వినియోగించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఏం హనుమంతురావు తెలిపారు. రేపల్లె ఏరియా పశు వైద్యశాలలో జరిగిన 3 మండలాల పశుసంవర్ధక సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం హనుమంతురావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ పశుబీమా పథకం ఆర్‌బికే స్థాయిలో అర్హులైనా రైతులకు బీమా చేయించి రైతులుకు లబ్ధి చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు, తెనాలి వారు డాక్టర్. కేదారేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్, డాక్టర్ జి నరేంద్ర బాబు, రేపల్లె మండలం పశువైద్యులు డాక్టర్ ఎ ప్రవీణ్ కుమార్ తుమ్మల, డాక్టర్ పి మీనాక్షి దేవి బొబ్బర్లంక భట్టిప్రోలు మండలం వైద్యులు డాక్టర్ బి లక్ష్మీ రంజిత భట్టిప్రోలు డాక్టర్ రోషన్ బేగ్ గుత్తావారిపాలెం, నిజాంపట్నం వైద్యులు శివకుమారి హేమ ప్రియా కూచినపూడి పారా సిబ్బంది, అనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్స్, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని నాగులపాడు రోడ్డులో కామేపల్లి కళ్యాణ మండపంలో రామాయపాలెం, తిమ్మాయపాలెం, కొటికలపూడి, కుంకుబాడు, మోదేపల్లి, పేరాయపాలెం, ధేనువకొండ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించాలని నేతలకు సూచించారు, ఈ సందర్భంగా ధేనువకొండ, కొటికలపూడి, రామాయపాలెం గ్రామాల నేతలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పై నుంచి వరద జలాలు వస్తే ఏంచేయాలో ఒక ప్రణాళిక రూపొందించడంలో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల గేటు కొట్టుకునిపోయి నీరు సముద్రం పాలయింది. వైసిపి నేతలు ఇసుక దోపిడీ కారణంగానే నేటికీ గేట్ల మరమ్మతులకు నోచుకోలేదనే అనుమానం కలుగుతోందన్నారు. దశాబ్ద కాలం గడవకముందే ప్రాజెక్టులోని కీలకమైన గేట్లు తుప్పు పట్టిపోవడం చూస్తుంటే నేటి ప్రభుత్వ పనితీరుకు నిలువుటద్దంలా కనిపిస్తోందని అన్నారు. రెండు సంవత్సరాల క్రితమే జలవనరుల శాఖ అధికారులు గుండ్లకమ్మ జలాశయంలోని మొత్తం 15 గేట్లకుగాను 10 గేట్లకు మరమ్మతులు అవసరమని గుర్తించి దాదాపు 3 కోట్ల రూపాయల అంచనాలు సిద్ధంచేసి పై అధికారులకు నివేదికను సమర్పించినా నిధుల కేటాయింపులో నిర్లక్ష్య ధోరణి అవలంబించడమే నేటి ఈ దుస్థితికి కారణమని ఆయన తెలిపారు.

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ధేనువకొండ గ్రామంలోని చెరువును అభివృద్ధి చేసి లిఫ్ట్ ద్వారా దిగువ పొలాలకు నీరు అందిస్తామని చెప్పారు. రాకపోకలకు అనువుగా గ్రామానికి అనుసంధానం చేస్తూ నూతన రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల గొంతునొక్కడం, సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాల్లా మార్చిన చరిత్ర వైసిపిదని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం సర్పంచ్‌ల డబ్బులు రూ.8,548.29 కోట్లు కొల్లగొట్టడంతో ఛీత్కరించుకుంటున్నారని అన్నారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ, గ్రామసర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా జగన్‌రెడ్డి మార్చారని విమర్శించారు. పల్లెలను అభివృద్ధికి దూరంగా, అనారోగ్యానికి ఆలవాలంగా మార్చారని అన్నారు. సర్పంచ్ స్థానాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు తమపై, తమ ప్రభుత్వంపై ఉన్న అభిమానంతో వైసీపీకి ఏకగ్రీవమయ్యాయని చెప్పుకున్నవారంతా, ఇప్పుడు జరుగుతున్నదానిని చూసి సిగ్గుపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. పంచాయతీ నిధులు మింగిన జగన్ సర్కార్‌ని పల్లె ప్రజలే గద్దె దించి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్

చిన్ననాటి నుంచే చదువుపై శ్రద్ధ చూపాలి: తాడివలస దేవరాజు

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువుపై శ్రద్ధ చూపాలని, తద్వారా విద్యా రంగంలో మంచి భవిష్యత్తు లభిస్తుందని కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. శనివారం పాఠశాల స్థాయిలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులైన దామర్ల సుకన్య, కొమ్ముల కీర్తన, భువనగిరి యామినిలకు ప్రభుత్వ బహుమానం పాఠశాల స్థాయిలో 3000 రూపాయలు, 2 వేల రూపాయలు, వెయ్యి రూపాయలు అందజేశారు. పాఠశాల స్థాయిలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం పేరాలలో మునిసిపల్ హైస్కూల్‌లో శనివారం జరిగింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు లు బి.సాల్మన్ రాజు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు డి యదాలమ్మ, మునీరుల్లా ఖాన్, జిల్లా సైన్సు కో ఆర్డినేటర్ పవని భాను చంద్ర మూర్తి, రాజేంద్రప్రసాద్, వై గాంధీ, చంద్ర శేఖర్, సుందర రామిరెడ్డి, రమణా రావు, కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులు మెరుగుపరచుకోవాలి

ప్రజాశక్తి-పర్చూరు

డిఆర్డిఏ అండ్ వెలుగు ఆధ్వర్యంలో మహిళలు జీవనోపాదులతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నియోజకవర్గంలోని వివోఏలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఐపిడిపిఎం యు సుబ్బారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో డిఆర్డిఏ పిడి వి అర్జున్‌రావు మాట్లాడుతూ మహిళలు పరిశ్రమల రంగాల్లో కూడా ముందుకు రావాలని కోరారు. మహిళలు అనేక యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా డీపీఎంయు స్టాఫ్, ఆరు మండలాల ఏపీఎంసీ సీసీలు 6 మండలాల వివోఏలు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి-సంతమాగులూరు

పదో తరగతి పరీక్షలలో జిల్లా స్థాయిలో మూడో స్థానం సాధించిన, మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన చందోలు నవ్యలక్ష్మి, ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 589 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. శనివారం బాపట్ల అగ్రికల్చర్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, బత్తుల బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా నవ్యలక్ష్మికి 15 వేల రూపాయల నగదు, మెడల్, ప్రశంసా పత్రాలను అందజేశారు. దీంతో ఏల్చూరు గ్రామంలోని నవ్యలక్ష్మి కుటుంబీకులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, దారా బాలయ్య, వెంకటేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-బాపట్ల

విశ్రాంత పోలీసు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకునే దిశగా రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసినట్లు రిటైర్డ్ ఏఎస్ఐ పి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయ ఆవరణలో రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల ప్రసంగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రిటైర్ అయిన పోలీస్ కానిస్టేబుల్ ఆ పైస్థాయి ఉద్యోగులు ఈ సంఘంలో చేర్చుకుంటామన్నారు. సమావేశంలో విశ్రాంత పోలీసు ఉద్యోగులు కె రామిరెడ్డి, జి ప్రసాద్‌బాబు, ఎస్‌డి ఇమామ్, సిహెచ్ శ్రీనివాసరావు, ఎన్ శామ్యూల్ రాజు, వెంకటప్పయ్య, కె. మాణిక్యాలరావు ఉన్నారు.



నర్సింగ్ హెూమ్‌లో రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న బూచేపల్లి

సినీ హీరో కమలాకరరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

వర్ధమాన సినీ నటుడు, కీర్తిశేషులు బూచేపల్లి కమలాకరరెడ్డి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక బూచేపల్లి కమలాకరరెడ్డి పార్కులోని ఘాట్‌లో కమలాకరరెడ్డి స్మారకమందిరంలో ఆయనకు బూచేపల్లి కుటుంబసభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ జవహర్ నర్సింగ్ హెూమ్‌లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నందిని దంపతులు, ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకరబాబు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కె శేఖరరెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షులు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, భీమన వెంకటరావు, రామబ్రహ్మం, సుందరరామిరెడ్డి, యల్లయ్య, ఎంపిటిసిలు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, కె.మాలకొండయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు నిరంతరం ప్రయత్నించాలి

'పేస్' అభినందన సభలో ఐఏఎస్ ర్యాంకర్ వినూత్న

ప్రజాశక్తి-టంగుటూరు

విద్యార్థులందరూ ఒక ఖచ్చితమైన లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన కోసం నిరంతరం ప్రయత్నం చేయాలని ఐఏఎస్ ర్యాంకర్ వినూత్న సూచించారు. శనివారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఏఎస్ ర్యాంకర్, డిప్యూటీ డైరెక్టర్ బి రవి కుమార్తె బొల్లిపల్లి వినూత్నకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఐఏఎస్‌కు ఎంపికైన వినూత్నను కళాశాల విద్యార్థులందరూ రోల్ మోడల్‌గా తీసుకోవాలన్నారు. మెకానికల్ విభాగంలో పట్టా పుచ్చుకొని ఐఏఎస్ సాధించిన వినూత్న మనందరికీ గర్వకారణం అని కళాశాల సిబ్బంది కొనియాడారు. అనంతరం ఐఏఎస్ ర్యాంకర్ వినూత్న తన లక్ష్యం, అభిప్రాయాలను కళాశాల విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో వినూత్న తండ్రి బి రవి, వినూత్న మేనమామ, విశ్రాంత వెటర్నరీ జేడీ డాక్టర్ వి.రవీంద్రనాథ్ ఠాగూర్, కళాశాల ప్రిన్సిపల్ జీవీకే మూర్తి, ఏఓ ఎం రమణబాబు, స్టూడెంట్స్ ఎఫైర్ డీన్ ఆర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి

వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

తన రాజకీయ ఉనికి కోసం పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి అనే వ్యక్తి పనికట్టుకొని మార్కాపురం శాసనసభ్యులు కేపీ నాగార్జునరెడ్డి, ఆయన సోదరుడైన కేపీ క్రిష్ణమోహన్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఆయన ప్రవర్తనను నియోజకవర్గ ప్రజలందరూ గమనిస్తున్నారని వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి మురారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి చేసిన ఆరోపణలు ఖండిస్తూ శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వైసిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి ప్రజా సేవలో నిమగ్నమై ఉన్న కుందురు కుటుంబాన్ని విమర్శించటం మంచి పద్ధతి కాదన్నారు. ఆరోపణలతో కాదు ఆధారాలతో రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో వైసిపి నాయకులు కొత్త క్రిష్ణా,దారివేముల శ్రావణ్ కుమార్, దొడ్డ భాగ్యలక్ష్మి, ఉత్తమ్‌కుమార్, చాతురాజుపల్లి శ్రీనివాసులు, కర్నాటి చెన్నకేశవులు, దొడ్డ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా..

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- మంత్రి ఆదిమూలపు సురేష్ - జగనన్న ఆణిముత్యాలు అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యారంగంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర పురపాలక మరియు పట్ట ణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కొనియాడారు. స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శనివారం "జగనన్న ఆణిముత్యాలు" జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివి ప్రథమ ద్వితీయ, తతీయ ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇలాంటి.. పురస్కారాలు మరింత ఉత్సాహం ఇస్తాయని అన్నారు. పేద విద్యార్థులకు ఈ కార్యక్రమంతో ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అవసరమైన అన్ని సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఇలాంటి ఉన్నతమైన కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదు ప్రోత్సాహకాలను అందించడం, విద్యార్థుల తల్లిదండ్రులు, గురువులను సన్మానించడం గొప్ప కార్యక్రమంగా నిలుస్తుందన్నారు. పేద విద్యార్థులు చదువుకు అవసరమైన సహాయం కోసం తన దగ్గరకు వస్తే ఖచ్చితంగా తనవంతు సాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాదిగ కార్పొ రేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు, టైలర్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ సుభానీ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్, ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే 'ఆణిముత్యాలు'

మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అవార్డులు, నగదు పురస్కారాన్ని ఇచ్చి ప్రోత్సహించడానికి జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో బాపట్ల జిల్లా స్థాయి జగనన్న ఆణి ముత్యాలు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రాధాన్యత గుర్తించి పేదరికం వల్ల పిల్లల చదువులు ఆగిపోకూడదని విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో పాఠశాలలను మూడు దశల్లో నాడు నేడు కార్యక్రమం క్రింద వేల కోట్ల రూపాయలతో అభివద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో పేద పిల్లల చదువుకోసం అమ్మ ఒడి, వసతి దీవెన, విదేశీ విద్యా కార్యక్రమాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని అభివద్ధి చేయడానికి అధిక నిధులు ఖర్చు చేస్తుందన్నారు. విద్యార్థులు విద్య మీద దష్టి పెట్టి చదవాలన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యాతో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తు లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 24 మందికి,ఇంటర్ మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 14 మందికి రూ 14.55 లక్షల చెక్కులను మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర మార్కెటింగ్, సహకార ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మ రెడ్డి, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, విద్యాశాఖ ఆర్ .జె.డి సుబ్బారావు,జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఒంగోలులోని ఏబిఎం జూనియర్ కాలేజీలో ఆయుష్ శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ పద్మజాత ఆధ్వర్యంలో ఉపాస్ హాస్పిటల్, లయన్స్ క్లబ్ సంయుక్త సహకారంతో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒతో పాటు ఉపాస్ డైరెక్టర్లు డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ఉమాపతిచౌదరి, ఆయుర్వేద వైద్యులు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణ

అమర్నాథ్ కుటుంబానికి

రూ.10 లక్షల ఆర్థిక సాయం

- ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి నిర్మాణానికి సాయం..

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు వెల్లడి

ప్రజాశక్తి-రేపల్లె

హత్యకు గురైన అమర్నాథ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.పది లక్షల ఆర్థిక సాయం మంజూరు చేసిందని, అమర్నాథ్ సోదరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, ఇంటి నిర్మాణానికి సాయం చేస్తాని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రేపల్లెలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోపిదేవి మాట్లాడారు. బాలుడి హత్య విచారకరమన్నారు. రెండు కుటుంబాల మధ్య జరిగిన వ్యక్తిగత గొడవలను టిడిపి నాయకులు రాజకీయ పార్టీలకు, కులాలకు ఆపాదించటం వారి శవ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఘటన జరిగిన వెంటనే 24 గంటల్లో నిందితులను అదుపులోకి తీసుకోవటం జరిగిందని తెలిపారు. బాలుడి హత్య విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారని చెప్పారు. ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా సాయం అందించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వేమ్మెల్యే సత్యప్రసాద్

రేపల్లె ఎమ్మెల్యే రూ.5 లక్షల సాయం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఉప్పాల అమర్నాథ్ కుటుంబానికి రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్య ప్రసాద్ ఐదు లక్షల రూపాయల సొంత నిధులను ఆర్థిక సాయంగా అందజేశారు. అమర్నాథ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



వెంకటమ్మ చెక్కు అందజేస్తున్న ఎంపిడిఒ

మూడేళ్ల పింఛన్ ఒకేసారి..

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం మండలం పిచ్చిగుంట్ల పల్లె గ్రామం నివాసి వికలాంగురాలైన నాగిరెడ్డి వెంకటమ్మకి ప్రభుత్వం మూడేళ్ల క్రితం పింఛన్ నిలిపేసింది. తర్వాత ఆమెను అర్హురాలిగా గుర్తించి.. మూడు ఏళ్ల బకాయిలు మొత్తం రూ.84 వేల చెక్కును మండల పరిషత్ మార్కాపురం ఆఫీసులో ఎంపీడీవో ఎస్ నరసింహులు శనివారం అందజేశారు.



జెవికె ఆకారంలో కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

సిఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు

ప్రజాశక్తి-తర్లుపాడు

జగనన్న విద్యాకానుక అందించినందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డికి విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలు 'జెవికె' (జగనన్న విద్యాకానుక) ఆకారం వచ్చేలా కూర్చొని సిఎంకు కతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌కు సత్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఆ కళాశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని ఘనంగా సన్మానం చేశారు. శనివారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో 2023లో సీనియర్ ఎంపీసీ విద్యార్థిని ఆర్.శివకుమారి 1000లకు 973 సాధించినందుకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో శివకుమారి జిల్లా ప్రథమ స్థానం పొందింది. ఆ విద్యార్థిని మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిములపు సురేష్ ఘనంగా సత్కరించి, రూ.50వేల నగదు బహుమతిని అందజేశారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇనకొల్లు శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భూముల రీ సర్వేతో గ్రామాల్లో దశాబ్ధాలుగా చిక్కుముడిగా ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహశిల్దార్ కె రవీంద్రారెడ్డి అన్నారు. శనివారం గంజివారిపల్లి గ్రామంలో భూముల రీ సర్వేపై రైతులు అవగాహన కల్పించారు. వైఎస్సార్ జగనన్న భూ శాశ్విత భూ హక్కు-భూ సర్వే కార్యక్రమాన్ని సోమవారం నుంచి వెంకటాద్రిపాలెం రెవెన్యూ గ్రామంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, రీ సర్వే డిప్యూటి తహశిల్దార్ రామకృష్ణ, మండల సర్వేయర్ సైదారావు, విఆర్వో పిక్కిలి చెన్నయ్యతో గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా అన్నారు. బాపట్లలో మూడు రోజులు పాటు విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందారు. అనంతరం నెల్లూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ చేతులు మీదుగా శిక్షణ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో.!

విద్యుత్ కోతలతో జనం ఇక్కట్లు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో అప్రకటిత విద్యుత్ కోతలతో జనం అల్లాడుతున్నారు. కరెంటు లేక ఉక్కపోతకు గురై.. ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అసలు నిర్దిష్టంగా కరెంటు ఎప్పుడు తీస్తారో..తీశాక ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. అసలే భానుడి భగభగలు.. దానికి తోడు విద్యుత్తు కోతలు, ఫలితంగా భరించలేని తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ కోతలు నివారించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ఆరు వారాల నుండి కూలి ఇవ్వలేదు

వ్యకాస నాయకుల ఎదుట ఉపాధి కూలీల ఆవేదన

ప్రజాశక్తి-సంతనూతలపాడు



సంతనూతలపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఆరు వారాల నుండి కూలి డబ్బులు ఇవ్వలేదని ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులకు తెలిపారు. మండలంలోని మద్దులూరులో శనివారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేతన బకాయిలు ఇవ్వకపోతే కూలీలు ఎలా బతకాలని అన్నారు. ఉపాధి పనిని రక్షించుకోవాలని, ఈ ఉపాధి పని లేకపోతే మళ్లీ వలస బాట పట్టాల్సి వస్తుందని అందుకు ఉపాధి కూలీలందరూ ఐక్యంగా ఉండి దీన్ని కాపాడుకోవాలని, మీకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని చెప్పారు.

మద్దిపాడు: మండల పరిధిలోని నాగన్నపాలెంలో ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో సమయానికి డబ్బులు పడుతున్నాయా..లేవా, పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పనులను పరిశీలించిన వారిలో పోకూరి అశోక్, హనుమంతరావు, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

'ఆణిముత్యాల'కు అభినందన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల కేంద్రమైన పెద్దదోర్నాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో చదివిన అంబికాబాయి, క్రిష్ణ శ్రీబాయి, శిరీషా బాయిలు ఆణిముత్యాలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని శనివారం ఒంగోలులోని పివిఆర్ మున్సిపల్ పాఠశాల నందు జరిగిన కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ. 50 వేలు నగదు, ప్రశంసా పత్రం, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొన్నూరి శామ్యూల్ జోబ్ అభినందించారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఐక్యరాజ్యసమితి 2030 సంవత్సరం నాటికి సాధించాలని నిర్దేశించిన సుస్థిర అభివద్ధి లక్ష్యాలలో క్షయ వ్యాధి నిర్మూలన అతి ముఖ్యమైనదని మార్కాపురం యూనిట్ క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టిబి ముక్తిపంచాయతీ అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖఅధికారి డాక్టర్ కే రాహుల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో నరసింహులు, తిప్పాయపాలెం, గజ్జలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కే హిమబిందు, డాక్టర్ కిషోర్ రెడ్డి, మార్కాపురం సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ గోవిందరాజులు, టిబి హెల్త్ విజిటర్ లక్ష్మీరెడ్డి. మండలంలోని సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో ఇతర మండలాల నుండి 28 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు త్రిపురాంతకం మండలానికి వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి తులసి మల్లికార్జున నాయక్ తెలిపారు. అలాగే 31 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఇదే మండలంలో మరో పాఠశాలకు బదిలీ అయ్యారన్నారు. మండలం నుండి 14 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి పట్టణంలోని ఎస్‌కెఆర్ చెవిటి, మూగ ప్రత్యేక పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ అంజిరెడ్డి తెలిపారు. 6 నుంచి 18 సంవత్సరాలలోపు వయసు కలిగిన చెవిటి, మూగ పిల్లలు పుట్టుక నుంచి వినికిడి, మాటలు సరిగా రానివారికి 1నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేక విద్యతో పాటు, ఆధునిక పరికరాలతో స్పీచ్ థెరపి మిషన్ ద్వారా మాటలు నేర్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు 950506031, 9440336730 ఫోను నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రమైన కొనకనమిట్లలో కొలువైన అంకాలేశ్వరి దేవత తిరునాళ్ల శనివారం అరంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాద్ధాలను స్వీకరించారు. ఈ సందర్భంగా దేవాలయం సన్నిధిలో వైసిపి రెండు ప్రభలు, టిడిపి ఆధ్వర్యంలో ఒక ప్రభ, మొక్కుబడి కింద ఒక విద్యుత్ ప్రభలను ఏర్పాటుకు సిద్ధం చేశారు. పొదిలి సిఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో కొనకనమిట్ల ఎస్ఐ కె.దీపిక బందోబస్తు నిర్వహించారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

పొగనారు విత్తనాలు కావలసిన రైతులు స్థానిక పొగాకు బోర్డులో ఎకరాకు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు బోర్డులో ఆయన మాట్లాడారు. పొగాకు రైతులు తమ వ్యక్తిగత బీమా కోసం కూడా బోర్డులో అర్జీ అందజేయాలని సూచించారు.

టంగుటూరు విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక అరుంధతి నగర్ వాసి, టంగుటూరు పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపిసి విభాగంలో 972/1000 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానం సాధించిన సంద్రపాటి స్పందనకు అరుదైన గౌరవం దక్కింది. జగనన్న ఆణిముత్యాలు లో భాగంగా శనివారం సంద్రపాటి స్పందనను రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత తదితర ప్రముఖులు స్పందనను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వం ద్వారా ప్రశంసా పత్రం, 50వేల చెక్కును స్పందనకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్ఐఓ సైమన్ విక్టర్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది తదితరులు స్పందనను అభినందించారు.

'మొగళ్లూరు' విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం మొగళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నేరెళ్ల హరికష్ణ, ఆవుల వెంకటప్రహ్లాదరెడ్డిలు 586 మార్కులు సాధించి జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి శనివారం ఒంగోలు పివిఆర్ బాయ్స్ హైస్కూల్‌లో మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్‌ల చేతుల మీదుగా జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు ప్రతిభ అవార్డు రూ.50వేల నగదు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజాల కొండారెడ్డిని ఘనంగా సన్మానించారు.

గోనుగుంటలో 'గడపగడపకూ..'

ప్రజాశక్తి-చీమకుర్తి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బూచేపల్లి, టిజెఆర్

మండలంలోని గోనుగుంటలో ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబుతో కలిసి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం ముందుగా గోనుగుంటలో పోలేరమ్మ ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం గోనుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉప కలెక్టర్‌కు బీసీ సంఘం వినతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అమర్నాథ్‌ను పెట్రోల్ పోసి.. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బిసి సంఘం అధ్వర్యంలో శనివారం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయంలో ఉప కలెక్టర్ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి బ్రిలియంట్ కమ్యూనిటీస్ అసోసియేషన్ అధ్యక్షులు పిఎల్‌పి.యాదవ్, నియోజకవర్గ బిసి సంఘం అధ్యక్షులు రంగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతున్నాయని గిద్దలూరు బీసీ సంఘ నాయకులు అన్నారు. బాపట్ల జిల్లా రాజోలు గ్రామానికి చెందిన ఉప్పాల అమర్నాథ్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టిన నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ విజయకుమారి శనివారం బీసీ సంఘ నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కంచర్ల కోటయ్య గౌడ్, యాదవ సంఘ నాయకులు కటారు రాజా, అరుణ్ కుమార్ యాదవ్, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు బ్రహ్మయ్య, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు బంగారు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సైనికుడు మృతి

ప్రజాశక్తి-అర్ధవీడు

అర్ధవీడు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు చందా వెంకటేశ్వర్లు(50) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మతిచెందారు. మతునికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం దహన సంస్కారాలు చేస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. మతుని కుటుంబాన్ని మండల మాజీ సైనికుల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ షేక్ మౌలాలి, షేక్ మహబూబ్ బాషా పరామర్శించారు.

నాయుడుపాలెం ఆణిముత్యంకు అభినందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన బూదాల డెలోరస్ అనే ఇంటర్ విద్యార్థిని జిల్లా స్థాయిలో ఆణిముత్యంగా ఎంపికైంది. ఈ నేపధ్యంలో శనివారం ఒంగోలులోని పివిఆర్ పాఠశాల నందు జిల్లా స్థాయిలో జరిగిన ఆణిముత్యాల కార్యక్రమంలో డెలోరస్‌ను మంత్రి సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, విద్యాశాఖాధికారి రమేష్‌లు అభినందించారు.

వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మాధవరాజ్

ప్రజాశక్తి-వెలిగండ్ల

నియోజకవర్గం వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షునిగా మాధవరాజ్ ఎన్నికయ్యారు. గురువారం గుంటూరులో జరిగిన వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభ కనిగిరి నియోజకవర్గానికి వడ్డెర యువత అధ్యక్షులుగా మాధవరాజ్ ఎంపిక చేశారు. ఈయన వెలిగండ్ల మండలం పద్మాపురం గ్రామానికి చెందిన వారు. ఆయన వడ్డెర సమస్యలపైన నిరంతర కషిని గుర్తించిన రాష్ట్ర నాయకత్వం అధ్యక్షునిగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ కనిగిరిలోని వడ్డెర సమస్యలపైన నిరంతరం పని చేస్తానని, వారి అభివద్ధికి ప్రభుత్వం నుండి రావలసిన పథకాల కొరకు కషి చేస్తానని వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర అధ్యక్షులు పల్లపు శివయ్య, కనిగిరి నియోజకవర్గం వడ్డెరలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం యూత్ అధ్యక్షులుగా ఎన్నికైన దేవల్ల మాధవరాజ్ ఆంధ్రప్రదేశ్ సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం తరపున రాష్ట్ర అధ్యక్షులు పల్లపు శివయ్య అభినందనలు తెలిపారు.



ప్రహరీ లేని పాఠశాల

పాఠశాలలో పాముల భయం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పాముల భయంతో విద్యార్థులు భయపడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వలన ఎప్పుడు పాములొస్తాయో అని తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాలను ఆనుకొని పొలాలు ఉండటం వలన తరచుగా పాములు వస్తున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. రావడంతోనే భయం భయంగా తలుపు తీసే పరిస్థితి ఉందన్నారు. నాడు నేడు ద్వారా తమ పాఠశాల అభివృద్ధికి చొరవ తీసుకున్న ప్రభుత్వం, ప్రహరీ గోడను కూడా నిర్మించాలని తల్లిదండ్రులు కోరారు. అలాగే తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్ల కాలంలో 3 పాములను మట్టు పెట్టినట్లు తెలిపారు. వరిగల్లు పాములు తప్పించుకున్నాయని తెలిపారు. పాముల వల్ల చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరక్క ముందే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



పగలే వెలుగుతున్న వీధి దీపాలు

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలంలోని చుండూరుపల్లి, ఈతేరు గ్రామాలతో పాటు, పట్టణంలోని ఒక ప్రాంతంలో వీధి లైట్లు వెలుగుతూ దర్శన మిచ్చాయి. వీధి దీపాలు వెలుగుతూ ఉండటం వల్ల విద్యుత్ వృథాగా పోతుందని స్థానికులు తెలిపారు. గ్రామాల్లో సిబ్బందికి వేతనం ఇవ్వకపోవడం వలన ఇలా వచ్చిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ కోతలతో ప్రజలు సతమతమవుతున్న ఈ రోజుల్లో ఇలా పట్టపగలు లైట్లు వెలిగించి నిర్లక్ష్యంగా ఉండటం పట్ల స్థానికులు మండిపడు తున్నారు. అధికారులు విద్యుత్ వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

అర్హులందరికీ జగనన్న సురక్ష పథకం

ప్రజాశక్తి-కొల్లూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న సురక్ష పథకం అందాలని ఎంపీడీవో ఐ సత్యనారా యణ అన్నారు. శనివారం కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సచివాలయం డీఏలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ తిరుగుతూ వారికి అవసరమైన తొమ్మిది రకాల సర్టిఫికెట్లు, ఇన్కమ్ సర్టిఫికెట్, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, మ్యారేజి సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ ఎమ్మార్వో నుంచి, ఇలాంటివి తొమ్మిది రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు.

గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తాం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో శనివారం పద్మాశాలీయ కల్యాణ మండపంలో జగనన్న కాలనీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్థక శాఖ జెడి హనుమంతరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం నిరుపేదలకు నివేశన స్థలాలను కొనుగోలు చేసి ఇచ్చిందని, దీనిలో గృహ నిర్మాణానికి కూడా డ్వాక్రా ద్వారా రూ.35 వేల రుణం అందజేస్తున్నట్లు తెలిపారు. వీటితో బేసిమెంట్ నిర్మించవచ్చని అన్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభించకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసి పట్టా తొలగిస్తామని అన్నారు. ఈ మేరకు మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ గృహ నిర్మాణాలు చేపట్టే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డివి లాలితకుమారి, జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు, ఎంపిడిఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ సౌమ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి హనుమంతరావు

ఇపిసెట్‌లో శ్రీ గౌతమి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చీరాల

ఇఎపి సెట్‌లో శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్లు (ఎంవి) అన్నారు. శనివారం పట్టణం లోని స్థానిక శ్రీ గౌతమీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏపీ సెట్ లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఏపీ సెట్ 2023 ఫలితాలలో జీవీ కార్తికేయ 2758వ ర్యాంకును, కె తాన్య 4686వ ర్యాంకును, టి హారిక 4719వ ర్యాంకును, ఏ నాగలహరి 5308, వై సాయి హనుమరెడ్డి 6780 ర్యాంకులను సాధించారన్నారు. అదేవిధంగా 20వేల లోపు ర్యాంకులను మొత్తం 24 మంది విద్యార్థులు సాధించాలని, ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఎంసిహెచ్ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించి విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, మరియు విద్యార్థులకు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఎండి ఎం వెంకటేశ్వర్లు

విద్యార్థినికి ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన వేశపోగు కాశయ్య కుమార్తె వేశపోగు ప్రవళిక హనుమంతునిపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 600కు గాను 565 మార్కులు సాధించి ప్రకాశం జిల్లా కస్తూర్బా గాంధీ విద్యాలయాల టాపర్‌గా నిల్చింది. జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా అవార్డులో భాగంగా ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్‌శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా కస్తూర్బా గాంధీ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఇందిరా సుహాసిని, వేశపోగు ప్రవళిక కలిసి ప్రథమ బహుమతిగా రూ.50 వేలతో పాటు ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్, మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన హనుమంతునిపాడు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంత చక్కటి విద్యను అందించిన ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఇందిరా సుహాసిని, ఉపాధ్యాయ సిబ్బందిని, అవార్డుకు ఎన్నికైన వేశపోగు ప్రవళికను అభినందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి గుర్రం పెద్దిరాజు వేశపోగు ప్రవళికను అభినందించారు.



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న కలెక్టర్

సొసైటీ ద్వారా భారీగా పంట రుణాలు

పంగులూరు పిఏసిఎస్ అధ్యక్షులు రావూరి రంగారావు

ప్రజాశక్తి-పంగులూరు



వ్యవసాయానికి జాతీయ బ్యాంకులు ఇచ్చినట్లుగానే భారీ స్థాయిలో సొసైటీ ద్వారా పంట రుణాలు ఇస్తున్నట్లు, జనకవరం - పంగులూరు పిఏసిఎస్ అధ్యక్షులు రావూరి రంగారావు తెలిపారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా సహకార సొసైటీ కూడా రైతులకు పంట రుణాలను భారీగా ఇస్తుందని, గతంలో మాదిరి కాకుండా, క్రాప్ లోన్లు ఎవరికి వారికి విడివిడిగా ఇస్తున్నామని రంగారావు తెలిపారు. శనివారం పంగులూరులోని సొసైటీ కార్యాలయంలో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ, గతంలో పదిమంది రైతులకు కలిపి క్రాప్ లోన్లు ఇచ్చేవారమని, అయితే ఇప్పుడు రైతాంగానికి ఉపయోగంగా ఉండేందుకు వీలుగా, ఎవరికి వారికే పంట రుణాలు ఇస్తున్నామని చెప్పారు. నాలుగు ఎకరాల పొలం ఉంటే 14.5 లక్షల రూపాయలు వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. నాలుగు ఎకరాల పొలాన్ని మార్ట్‌గేజ్ చేయిస్తే, క్రాప్ లోను కింద మూడు లక్షల రూపాయల వరకు, కర్షక మిత్ర కింద 7 లక్షల రూపాయలు, లాంగ్ టర్మ్ రుణం కింద 4.52 లక్షల రూపాయలు, మొత్తం 14.52 లక్షల రూపాయల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. ఇందులో క్రాప్ లోనుకు ఏడు శాతం వడ్డీ, కర్షక మిత్ర రుణానికి 11 శాతం వడ్డీ, ఎల్‌టి లోనుకు 11.75 శాతం వడ్డీ పడుతుందని రంగారావు తెలిపారు. ఎల్టిలోను ఐదేళ్లపాటు వాయిదాల పద్ధతిలో చెల్లించుకోవచ్చని, క్రాప్ లోను ప్రతి ఏటా చెల్లించాలని, లేదా రెన్యువల్ చేసుకోవచ్చు అని చెప్పారు. రైతులు సొసైటీ ఇస్తున్న సహకారాన్ని ఉపయోగించుకొని, వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని, దీని ద్వారా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సంవత్సరం సొసైటీ ద్వారా మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని, శనగల కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించినట్లు రావూరి రంగారావు తెలిపారు. ఈ సంవత్సరం శనగలు 4985 బ్యాగులు, మొక్కజొన్నలు 10,452 బ్యాగులు, రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ లక్ష్మీదేవి పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

టిడిపి నాయకుడికి మాజీ మంత్రి నివాళి

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండలం తిప్పలకట్ట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుడితిపూడి ఉమామహేశ్వరరావు శనివారం గుండెపోటుతో మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని మాజీ మంత్రి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వాళ్ల కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించినవారిలో కొల్లూరు తిప్పలకట్ట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం చుండూరుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ గొ రిజవోలు వంశీకృష్ణ పాల్గొని విద్యార్థులకు జగనన్న కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి జరుగుతోందని అన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాలుగా సదుపాయాల కల్పన చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు సాంబయ్య, సిహెచ్‌ఓ విద్య, అంగన్‌వాడీ కార్యకర్త అరుణకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాటతప్పిన జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-భట్టిప్రోలు



తునుగుంట్ల సాయిబాబా

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుడివాడలో టిడ్కో గృహాల పంపిణీలో మాట తప్పారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలతో ఆనాడు చంద్రబాబు నాయుడు టిడ్కో గృహాలను 90 శాతం పైగా పూర్తి చేయగా జగన్మోహన్‌రెడ్డి ఆ పది శాతం కూడా పూర్తి చేయకపోగా ఆనాడు కంట్రిబ్యూషన్ చెల్లించిన వారి పేర్లు తొలగించి తన పార్టీ వారికి కట్టపెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడివాడలో 1600 మంది వాటా చెల్లించిన వారిని తొలగించి తమ వారికి ఇవ్వటాన్ని తప్పుపట్టారు. ఇదేనా సంక్షేమం అమలు చేయడం అని ఆయన ప్రశ్నించారు. వేల కోట్లు ఖర్చుచేసి చంద్రబాబు కట్టిన టిడ్కో గృహాలకు వైసిపి రంగులు వేసుకోవడం సిగ్గుచేటన్నారు. మిగిలిన 10 శాతం పనులు వెంటనే పూర్తి చేసి ఐదేళ్ల క్రితం వాటాను చెల్లించిన లబ్ధిదారులకు మాత్రమే గృహాలు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, కటకం కుమారస్వామి, నారాయణ, కలాం, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పర్చూరు తహశీల్దారుగా సంధ్యశ్రీ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు తహశీల్దారుగా కె సంధ్యశ్రీని నియమిస్తు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వేటపాలెం తహశీల్దారుగా పనిచేసి సెలవులో ఉన్న సంధ్యశ్రీని పర్చూరు తహశీల్దారుగా నియమించారు. ప్రస్తుతం పని చేస్తున్న తహశీల్దారు నెహ్రూబాబును కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేయండి

- ఇళ్లు రద్దు చేసుకున్న వారికి రూ.22 కోట్లు ఇవ్వాలి
- సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ డిమాండ్



మాట్లాడుతున్న రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో మొదటి, రెండో విడత టిడ్కో ఇళ్లు నాలుగు వేలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్ళ నిర్మాణాలను సిపిఎం ప్రతినిధి బందం శనివారం పరిశీలించింది. ఈ బందంలో సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ నగర కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు శ్రీరామశ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో జి.రమేష్ మాట్లాడుతూ 2020లో ఒంగోలు నగరంలో అందరికి ఇళ్ళు ఇస్తామని ప్రకటించి చింతల వద్ద శంకుస్థాపన చేశారన్నారు. టిడ్కో ఇళ్ళ నిర్మాణాలకు నిధులు కేటాయించి.. త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిధులు లేని కారణంగా పనులు జరగడం లేదని, మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. కొరవపడిన ఇళ్ళను పూర్తి చేయటానికి నిధులు అవసరమని, వీటిని త్వరగా విడుదల చేయాలన్నారు. టిడ్కో ఇళ్ళు రద్దు చేసిన లబ్ధిదారులు నాలుగు వేల మంది ఉన్నారని, వీరికి రూ.22 కోట్లు ఒంగోలు నగర పాలక సంస్థ చెల్లించాలన్నారు. నేటికీ వాటిని చెల్లించలేదన్నారు. లబ్ధిదారులు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే లబ్ధిదారుల వాటాధనం చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో పది సంవత్సరాల నుండి ఇళ్ళ స్థలాలు ఇవ్వలేదని, గతంలో కొప్పోలు / యరజర్ల కొండ దగ్గర స్థలాలు ఇస్తామని చెప్పి చదును చేసి ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం 250 ఎకరాలు అగ్రహారం వద్ద స్థల సేకరణ చేసిందని, ఎకరా రూ.35 లక్షలుగా ధర నిర్ణయించారన్నారు. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించి.. ప్లాట్లు వేసి అర్హులైన లబ్ధిదారులందరికీ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలో ఇళ్ళ స్థలాలు లేని పేదలందరికీ రెండు సెంట్ల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ప్రజలను కూడగట్టి ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. సమావేశంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలలో

వెలుగులు నింపుతున్న నవరత్నాలు

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దారవీడు

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల కుటుంబాలలో వెలుగు నింపుతున్నాయని రాష్ట్ర పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పెద్దారవీడు మండలం తంగిరాలపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం పరంగా ఏం వరకు లబ్ధి చేయకున్న విషయాన్ని లబ్ధిదారులకు వివరించారు. 25 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సిమెంట్ రోడ్‌ను ప్రారంభించారు. వైఎస్ఆర్ యంత్ర పరికరాలలో బాగంగా గ్రూప్ సభ్యులకు రాయితీపై ట్రాక్టర్ పంపిణీ చేశారు. విద్యార్థులకు జగనన్న కిట్లు పంపిణీ చేశారు. ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణించిన సచివాలయం కన్వీనర్ పిన్నెబోయన ఈశ్వరయ్య కుటుంబానికి రూ.50 వేల నగదు మంత్రి గారి స్వంత నిధుల నుండి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు చేసిన సదురు పాదయాత్రలో పేదలు కష్టాలు తెలుసుకొని చలించిపోయారని ఆ కష్టాలు తీర్చేందుకు ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు పరుస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ఏమి లేక ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సంక్షేమ పథకాలపై విరుచుకుపడుతున్నారని విమర్శించారు. ఈ పథకాలు రద్దు చేస్తామని కొత్తగా ప్రవేశపెడతామని ఎక్కడ అనడం లేదని ఆ పథకాలు కొనసాగిస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో అనేక స్కాములు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, జడ్పిటిసి ఏరువా చలమారెడ్డి, సర్పంచి తోకల నాగమల్లేశ్వరి, ఎంపీటీసీ ఉప్పలపాటి భాగ్యరేఖ, డివిజనల్ అభివద్ధి అధికారి సాయికుమార్, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటకష్ణారెడ్డి, ఏపీవో సాంబశివయ్య, ఏపిఎం శ్రీనివాసులు, హౌసింగ్ ఏఇ శ్రావ్య, విద్యుత్ ఏఇ రమేష్, సర్పంచులు వెన్నా శివ కష్ణారెడ్డి, పాలగిరి రామాంజనేయరెడ్డి, ములా వెంకటరమణరెడ్డి, అంగిరేకుల ఆదినారాయణయాదవ్, బెజవాడ ఆదం, వైసీపీ నాయకులు చిమట వెంగయ్య, మండల సోషల్ మీడియా కన్వీనర్ శొంఠి నాగార్జునరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తడికమల్ల బాలసుబ్బారావు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి సురేష్

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉన్నత స్థానానికి చేరుకోవడానికి విద్యతోపాటు సమకాలీన అంశాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం గుంటూరు రోడ్డులోని ఏ-1 కన్వెన్షన్ హాలులో నిర్వహించిన బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ 2023 కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పూర్తయిన తరువాత ఇంజినీరింగ్ విభాగంలో ఏ కోర్సు, ఏ యూనివర్శిటీ, ఏ కాలేజీని ఎంపిక చేసుకోవాలి అనే అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన బ్రిలియంట్ ఎడ్యుకేషనల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయం బ్యాంకుల నుంచి ఏ విధంగా పొందాలి అని తెలిపేలా స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. గత 20 సంవత్సరాల నుంచి ఈ విద్యా సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇంజినీరింగ్ విభాగంలోనే కాకుండా విద్యార్థులకు అవసరమైన అన్ని విభాగాలలో ఇలాంటి కార్యక్రమాలు జిల్లా మొత్తం చేపట్టాలని కలెక్టర్ వారికి సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు కమ్యునికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని దష్టిలో పెట్టుకుని ఆ వైపు పట్టు సాధించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల అనేక విషయాలు విద్యార్థులు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కె న్యామతుల్లా బాషా, డాక్టర్ ఎస్‌కె తహూర, సివిల్స్ ర్యాంక్ సాధించిన ఒంగోలు యువతి బి. వినూత్న, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాజోలు'లో రాక్షసత్వం..



బాపట్ల జిల్లాలో ప్రశాంతంగా ఉండే డెల్టా ప్రాంతమైన చెరుకుపల్లి మండలం, ఉప్పాలవారిపాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ అమానుష హత్యోదంతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. తన అక్క వెంటపడుతున్నాడని ప్రశ్నించినందుకు మనసులో పెట్టుకొని ట్యూషన్ కు వెళుతున్న విద్యార్థిని కొట్టి పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన మండల పరిధిలోని రాజోలు గ్రామ శివారులో జరిగింది. బాలుడి మృతితో చెరుకుపల్లి మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు గ్రామానికి వచ్చిన ఎంపీ మోపిదేవి వెంకటరమణకు నిరసన సెగ తగిలింది. గ్రామంలోకి రావొద్దంటూ బాలుడి బంధువులు, స్థానికులు ఎంపీని అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. తాను వ్యక్తిగతంగా కలిసి రూ.లక్ష పరిహారం అందించేందుకు వచ్చానని మోపిదేవి చెప్పారు. 'మేమే మీకు రూ.లక్ష ఇస్తాం.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి..' అని గ్రామస్తులు నిరసన తెలిపారు. పోస్టుమార్టం అనంతరం అమర్నాథ్ మృతదేహంతో గ్రామస్తులు చెరుకుపల్లి సెంటర్‌లో ధర్నా చేపట్టారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అద్దంకి మండలం కొంగపాడు గ్రామానికి చెందిన గుడిపూడి కీర్తి ఎపిఇఎపి సెట్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్, తెలంగాణా ఎంసెట్లో 14వ ర్యాంకు సాధించింది. నీట్‌లో 323వ ర్యాంకు సాధించి అందరికి ఆదర్శంగా నిలిచింది.

జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో మొత్తం 108 ప్రభుత్వ మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. మరో 17 బార్లు ఉన్నాయి. మద్యం ధరలు అధికంగా ఉండటం.. నాటుసారా తక్కువ ధరల్లో లభిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని స్టువర్టుపురం, వెదుళ్ళపల్లి, బేతంపూడి, దిండి, రామానగర్, నిజాంపట్నం తదితర ప్రాంతాలలో నాటుసారా ఉత్పత్తులు అధికంగా విక్రయాలు జరుగుతున్నాయి. నాటుసారా తయారీ చేస్తున్న వారిపై గతంలో పీడీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. వారిలో మార్పు తెచ్చేందుకు స్వయం ఉపాధి కోసం రుణాలు కూడా ఇప్పించారు. నాటుసారా ఉత్పత్తులు, విక్రయాలను పూర్తిగా నిరోధించేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చిన్నారులు, గర్భిణీల్లో పోషణ లోపం, రక్తహీనత నివారణ కోసం వారు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వారికి సక్రమంగా చేరడం లేదు. ఈ రంగంలో సుస్థిరాభివద్ధి లక్ష్యాల సాధన పేరుతో ప్రభుత్వం ఎనిమిది అంశాలను పేర్కొంటూ వాటిలో పురోగతి ఉండేలా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పథకాలు అమలుచేస్తోంది. కానీ బాపట్ల జిల్లాలో సంపూర్ణ పోషణ పథకం అమలు 78 శాతం మాత్రమే ఉంది. పిల్లలు ఎత్తుకు తగిన బరువు, వయస్సుకు తగిన ఎదుగుదల ఉండటం లేదు. కిశోర బాలికల్లో రక్తహీనత ఉంటుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం జిల్లాలో 1,828 మంది గర్భిణీలు ఉండగా అందులో 1,188 మంది పోషణ లోపంతో బాధపడుతున్నారు. గర్భిణీలను ఆరోగ్యవంతులుగా చేయడానికి ప్రభుత్వం మంజూరు చేసిన సంపూర్ణ పోషణ పథకం సక్రమంగా అమలు చేయాల్సిఉంది.

జిల్లా పరిధిలో జాతీయ రహదారులపై అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి ప్రమాదాలలో క్షతగాత్రులకు తక్షణమే వైద్యం అందించడానికి జిల్లాలో పలు ప్రభుత్వ వైద్యశాల్లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా అంటున్నారు కాని అది కార్యరూపం దాల్చడం లేదు. గడిచిన మే నెలలో జిల్లా వ్యాప్తంగా రహదారులపై జరిగిన ప్రమాదాలలో 30 మంది మృతి చెందారు. వీరికి తక్షణ వైద్యసేవలు అందే పరిస్థితులు లేవు. జాతీయ రహదారిపై వాహనాల డ్రైవర్ల కోసం విశ్రాంతి స్థలాలు నిర్మాణాలు చేపట్టాలి. బాపట్ల,చీరాల, అద్దంకి,పర్చూరులో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

ప్రభుత్వ సేవలు ప్రజలందరికీ అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కొత్తగా తెస్తోంది. ఇప్పటికే ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన, జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర పేర్లతో కార్యక్రమాలు చేపట్టింది. అవి చాలవన్నట్లుగా ఇప్పుడు జగనన్న సురక్షను తెచ్చింది. ఇందుకోసం ఇంటింటికీ వాలంటీర్లు వెళ్ళి సమస్యలను తెలుసుకోనున్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో ఒక బందంగా, ఈవో పి ఆర్ డి, ఉప తాసిల్దార్, ఆర్ఐలతో బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్, ఉప తహసిల్దార్ బృందంగా దీన్ని పర్యవేక్షించనున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీన ప్రారంభిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కుల, ఆదాయ, కుటుంబ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు అక్కడికక్కడే జారీ అవుతాయని, ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియతో పాటు సి.సి.ఆర్.సి. కార్డులను కౌలు రైతులకు అందిస్తారని చెబుతున్నారు. సచివాలయాల కేంద్రంగా ఈ కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణపై ప్రత్యేక బృందాలు పనిచేస్తాయని ప్రభుత్వం చెబుతోంది.

\- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా